ఆర్థిక ఇబ్బందులున్నా అభివృద్ధి ఆపడంలేదు

పెదకొత్తపల్లిలో కాటేజీల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి జూపల్లి

- **మంత్రి జూపల్లి కృష్ణారావు**

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 8 : రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా అభివృద్ధి పనులు ఆపడం లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం మండలకేంద్రంతో పాటు, కల్వకోలు, జొన్నలబొగుడ, చెన్నపురావుపల్లి, సాతాపూర్ గ్రామాల్లో రూ.2కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతోందన్నారు. కార్యక్రమంలో మాజీఎంపీపీ ప్రతాప్‌గౌడ్, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు ఉన్నారు.

బీటీ రోడ్డుకు శంకుస్థాపన

కొల్లాపూర్ రూరల్, ఫిబ్రవరి 8 : మండలంలోని చింతలపల్లి నుంచి కొల్లాపూర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శనివారం మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నియోజకవర్గంలోని పల్లెలకు దెబ్బతిన్న రహదారులను మళ్లీ పునర్ నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యాటకంతోనే అభివృద్ధి

పర్యాటకంతోనే ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం నాయినోనిపల్లి మైసమ్మ ఆలయం వద్ద రూ.3కోట్లతో కాటేజీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కొల్లాపూర్ ప్రాంత పర్యాటక రంగానికి పుట్టినిల్లుగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు ఉన్నారు.

బైపాస్ బాధితులను ఆదుకోవాలి

చారకొండ, ఫిబ్రవరి 8 : కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఇండ్లు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని సీపీఎం ఏరియా కార్యదర్శి బాలస్వామి అన్నారు. శనివారం మండల కేంద్రంలో మాట్లాడుతూ..బైపాస్‌లో చాలా మంది పేదలు ఇండ్లు కోల్పోవడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇండ్లు కూల్చేసిన అధికారులు బాధితుల గోడు పట్టించుకోవడం లేదన్నారు. బాధితులకు ఇంటి స్థలంతోపాటు ఇల్లు నిర్మించేవరకు బాధితుల పక్షాన పోరాటం చేస్తామన్నారు. 10న బాధితులతో కలిసి కలెక్టరేట్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు.

మహిళా సాధికారతకు తోడ్పాటునందించాలి

- **కలెక్టర్ సంతోష్**
- **అవగాహనలో ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్ సీఆర్‌పీలు**

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 8 : నాగర్‌కర్నూల్ జిల్లాలోని గ్రామీణ మహిళలకు అవగాహన కల్పించి మహిళా స్వయంసహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు ప్రణాళికా బద్ధంగా పనిచేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాలోని మహిళా సంఘాల బలోపేతానికి గ్రామస్థాయి కమ్యూనిటీ రీసోర్స్ పర్సన్లు, నూతనంగా జిల్లాకు కేటాయించిన సీఆర్‌పీలకు ఒకరోజు శిక్షణ తరగతులను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసి కార్యక్రమానికి కలెక్టర్ హాజరై స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, ఖమ్మ, వరంగల్ జిల్లాల నుంచి వచ్చినాగర్‌కర్నూల్ జిల్లాలోని స్వయం సహాయ మహిళలకు నాయకత్వం, పారిశ్రామిక, ఆర్థిక స్వావలంభన దిశగా అడుగులు పడేలా కృషి చేయాల్సిన బాధ్యత, కర్తవ్యంగా భావించి పనిచేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో మహిళా సంఘాల ఏర్పాటు, ప్రోత్సాహం, బలోపేతం చేయడానికి జిల్లాలోని కేటాయించిన మండలాల్లోని ఆయా గ్రామాలకు వెళ్ళి, అవగాహన, శిక్షణ కార్యక్రాలను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. వ్యాపారాల నిర్వాహణకు రుణాలను అందించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌తోపాటు స్వయం సహాయక సంఘాలకు క్యాంటిన్ ఏర్పాటు చేసి మహిళా ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని మహిళలకు చాలా అంశాలపై అవగాహన తక్కువగా ఉందన్నారు. స్వయం సహాయక సంఘాల్లో మహిళలు జిల్లాలోని ప్రతి గ్రామంలో సభ్యులుగా ఉన్నారని, ఆయా సంఘాల్లో మహిళలు సంఘటితమై సామాజిక సమస్యలను పరిష్కరించడంలో సీఆర్‌పీల పాత్ర అత్యంత కీలకమని కలెక్టర్ చెప్పారు. ప్రైవేట్ మైక్రో ఆర్థిక సంస్థల రుణం, చక్రవడ్డీ ఉచ్చులో పడకుండా మహిళలను ఆదుకునేందుకు శ్రీనిధి పబ్లిక్ సెక్టార్ బ్యాంకు ద్వారా రుణాలను అందించి ప్రోత్సహించేందుకు పంచ సూత్రాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. గ్రామాల్లో తిరిగే మహిళా సంఘాల పరిశీలన అంశాలు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులకు రిపోర్టు చేయాలన్నారు. ప్రతి సంఘం తప్పకుండా సమావేశాలు,పొదుపు, అప్పుల మంజూరు, అప్పుల వసూళ్లు, శిక్షణ పొందిన బుక్ కీపర్‌చేత సమర్థవంతంగా పుస్తక నిర్వహణ అంశాలపై అవగాహన కల్పించారన్నారు. రాష్ట్రంలో ని ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల నుంచి హాజరైన సీఆర్‌పీలు తమ అభిప్రాయాలను దేశంలో ని వివిధ రాష్ట్రాల్లో నిర్వహించిన శిక్షణ సేవలను వివరించారు. వివిధ భాషలు నేర్చుకొని స్వయం సహాయకసంఘాల కు వారిభాషలోనే శిక్షణ అందించడం జరిగిందని కలెక్టర్‌కు సీఆర్‌పీలు వివరించారు.

శిక్షణలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి చిన్న ఓబులేసు, డీఆర్‌డీఏ అదనపు పీడీ లక్ష్మీనారాయణ, గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు పాల్గొన్నారు.

సర్జికల్ క్యాంప్ ద్వారా పేదలకు వైద్యం

శస్త్రచికిత్స చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

- **ఎమ్మెల్యే వంశీకృష్ణ**

అచ్చంపేట రూరల్, ఫిబ్రవరి 8 : వందపడకల దవాఖానలో రెండోసారి చేపట్టిన సర్జికల్ క్యాంప్ ద్వారా నియోజకవర్గంలోని పేదలకు ఉచిత వైద్యం అందుబాటులోకి వచ్చిందని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. శనివారం స్థానిక దవాఖానలో కొనసాగుతున్న క్యాంప్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మూడురోజులపాటు కొనసాగుతుందని నల్లమల ప్రాంత ప్రజలు వైద్యపరంగా ఇబ్బందులు ఎదుర్కొవద్దనే ఉద్దేశంతో ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, డిప్యూటీ డీఎంహెచ్‌వో తారాసింగ్, సూపరింటెండెంట్ ప్రభు, ఆర్‌ఎంవో ప్రదీప్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

వాహనాల పత్రాలు పరిశీలిస్తున్న ఎస్సై శంషొద్దీన్

చారకొండ, ఫిబ్రవరి 8 : వాహనదారులు మద్యం తాగి నడపడం వల్లనే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఎస్సై శంషొద్దీన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారి టోల్‌ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేసి పత్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని, అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ఐఐటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్షలు

ఆన్‌లైన్ పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు

అచ్చంపేట రూరల్, ఫిబ్రవరి 8 : ఐఐటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ పరీక్షలు శనివారం నిర్వహించారు. విద్యారంగంలో ఆధునిక సాంకేతిక మార్పులను తీసుకరావాలనే ఉద్దేశంతో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ల్యాప్‌టప్, ట్యాబ్‌లను ఉపయోగించి ఆన్‌లైన్ ఎగ్జామ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్ సీఎం రెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటయ్య, కరస్పాండెంట్ మన్సూర్‌ఖాన్, విద్యార్థులు ఇతర సిబ్బంది, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో జంటపాముల కలకలం

- *రస్సెల్స్ వైపర్‌లుగా గుర్తింపు*
- *స్నేక్ క్యాచర్ సహాయంతో పట్టివేత*
- *క్యాచర్ వంశీని అభినందించిన కలెక్టర్*

కలెక్టరేట్‌లో పాములను పట్టుకుంటున్న క్యాచర్ వంశీ

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 8 : జిల్లా కలెక్టరేట్ ఆవరణలో శనివారం జంట పాములు ప్రత్యక్షమై కలకలం రేపాయి. ప్రాంగణంలో పచ్చదనం కోసం ఏర్పాటు చేసిన మొక్కల మధ్య రెండు(ఆడ, మగ) పాములను ఉద్యోగులు గుర్తించారు. వెంటనే స్నేక్‌క్యాచర్ తెప్ప వంశీకి సమాచారం ఇవ్వడంతో కలెక్టరేట్‌కు చేరుకున్న క్యాచర్ వాటిని పట్టుకున్నాడు. వీటిని మొదట కలెక్టరేట్ సిబ్బంది, ఉద్యోగులు కొండ చిలువ అనుకున్నప్పటికీ పట్టుకున్న క్యాచర్ వంశీ రస్సెల్స్ వైపర్ అనే జాతికి చెందిన విషపూరితమైన పాములుగా గుర్తించాడు. అనంతరం బిజినేపల్లి సమీపంలోని బుద్దారం అడవిలో వదిలేశారు. ఈ సందర్భంగా క్యాచర్ వంశీ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రస్సెల్స్ వైపర్ జాతికి చెందినపాములు మనుగడ సాధిస్తున్నాయని, ఇవి అనేక ప్రాంతాల్లో నిత్యం కనిపిస్తున్నట్లు తెలిపారు. మీటింగ్ సమయంలో ఈ పాములు కలిసి ఉంటాయన్నారు. అదేవిధంగా ఇదే జాతికి చెందిన పట్టణంలోని మరోపామును హౌజింగ్‌బోర్డు సమీపంలోని రవితేజ పాఠశాల వెనకభాగంలో శరత్‌బాబు అనే వ్యక్తి ఇంటి ఆవరణలో శనివారం గుర్తించి పట్టుకున్నట్లు వంశీ తెలిపాడు. పట్టణ పరిధిలో ఇలాంటి పాములు కనిపిస్తే వాటికి హాని కలిగించకుండా తమకు ఫోన్ 9703476691 కు సమాచా రం ఇస్తే సురక్షితంగా పట్టుకొని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా క్యాచర్ వంశీని కలెక్టర్ సంతోష్ అభినందించారు.

గురుకులలో కనీస వసతులు కల్పించాలి

వెల్దండ, ఫిబ్రవరి 8 : మండల కేంద్రంలోని ఎస్సీ గురుకుల బాలికల పాఠశాలలో కనీస వసతులు కల్పించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం వెల్దండ తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. తమ పిల్లలను చూడడానికి వచ్చి కనీసం నిలబడడానికి నిలువ నీడ లేదని, అన్నం తినపెట్టడానికి చోటులేదని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ ఎదుట మురుగు దుర్గంధంతో నిలబడలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెంకటయ్య, అశోక్, కొండల్, జమ్ములు తదితరులు ఉన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థినుల తల్లిదండ్రులు

రికార్డులు పరిశీలిస్తున్న ఏడీ శ్రీనివాసాచారి

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

వెల్దండ, ఫిబ్రవరి 8 : విద్యార్థులు వందశాతం ఉతత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ప్రభుత్వ మోడల్ స్కూల్స్ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఈవో చంద్రుడు, ఉపాధ్యాయులు ఉన్నారు.

చైతన్య సదస్సును విజయవంతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నాయకులు

బల్మూరు, ఫిబ్రవరి 8 : సగరుల రాజకీయ చైతన్య సదస్సును విజయవంతం చేయాలని సంఘం మండల నాయకులు వెంకటయ్య, తిరుపతయ్య, సుధాకర్ అన్నారు. శనివారం మండలంలోని అనంతవరం గ్రామంలో సంఘం సమావేశం ఏర్పాటు చేశారు. ఈనెల 16తేదీన నిర్వహించే సదస్సుకు రాష్ట్ర నాయకులు, వివిధ పార్టీల నాయకులు హాజరవుతున్నారన్నారు. కావున అందరు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, బాలయ్య, శ్రీను, బాలయ్య, నరసింహ, శివశంకర్, శ్రీరాములు, తదితరులు ఉన్నారు.

సగరసంఘం గౌరవాధ్యక్షుడిగా దుర్గాప్రసాద్

నియామకపత్రాన్ని అందజేసిన నాయకులు

లింగాల, ఫిబ్రవరి 8 : మండలకేంద్రంలో సగరసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, యువజనసంఘం జిల్లా అధ్యక్షుడి రాకేశ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం యువజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడిగా దుర్గా ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. జిల్లా సగర సంఘాన్ని బలోపేతం చేయడానికి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఈనెల 16న జిల్లా కేంద్రంలో నిర్వహించే సగర శంఖారావాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లాకోశాధికారి రాజు, ఉపాధ్యక్షుడిగా తిరుపతయ్య, లింగాల, బల్మూర్, అచ్చంపేట మండలాల అధ్యక్షుడిగా బాషా, వెంకటేశ్, సూర్యనారాయణ, జనార్ధన్ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కల్వకుర్తి రూరల్, ఫిబ్రవరి 8 : పట్టణంలోని షిరిడి సాయి సత్యసాయి ప్రశాంతి సన్నిధిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తునట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. ఈవైద్య శిబిరంలో ఉచితంగా షుగర్, బీపీ పరీక్షలు నిర్వహిస్తారని, పట్టణ పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వెల్దండ, ఫిబ్రవరి 8 : మండలంలోని చెర్కూర్‌కు చెందిన శంకర్‌జీ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని గ్రామబీఆర్ఎస్ నాయకులు శనివారం పరామర్శించి రూ.6వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో చెర్కూర్ మాజీ ఎంపీటీసీ భీమయ్యగౌడ్, మాజీ ఉపసర్పంచ్ నర్సింహ ముదిరాజ్, మైస య్య, అలీలొద్దీన్, లాలయ్య, రామరాజు, కొండల్ పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై నిర్లక్ష్యమొద్దు

శిశు సంజీవని కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి

- **డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి**

అచ్చంపేట రూరల్, ఫిబ్రవరి 8 : సమాజంలో ప్రతిఒక్కరూ చిన్నారుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయొద్దని డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి అన్నారు. శనివారం ఏరియా దవాఖానకు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా శిశు సంజీవని కేంద్రాన్ని పరిశీలించి డ్యూటీ డాక్టర్లకు తగు సూచనలు, సలహాలు తెలిపారు. చిన్నారుల వివరాలతో పాటు ఆరోగ్య స్థితిగతులను డాక్టర్ ప్రశాంత్‌ను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల బంధువులతో మాట్లాడుతూ.. తల్లిపాల ప్రాముఖ్యత, వెచ్చదనం, కంగారు మదర్‌కేర్ గురించి అవగాహన కల్పించారు. తక్కువబరువుతో పుట్టిన పిల్లలను ప్రిటర్మ్, బేబిస్ పసిరికలు తదితర ఆరోగ్య సమస్యలతో బాధపడే చిన్నారులను శిశు సంజీవని కేంద్రంలో వైద్యం చేయించుకోవాలని ఆమె సూచించారు. అనంతరం పట్టణంలోని ఆరోగ్య ఉపకేంద్రాల్లో టీకాకరణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వందపడకల దవాఖానలో రోగులకు అందుతున్న వైద్యం తీరును తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో తారాసింగ్, డీపీవో రేణయ, డివిజన్ మలేరియా అధికారి బిక్కులాల్, పర్యవేక్షకులు హన్మంతు, ఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు సహకరించాలి

బల్మూరు, ఫిబ్రవరి 8 : క్షయ నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలని డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ప్రభుత్వ పీహెచ్‌సీని సందర్శించారు. ఈనెల నుంచి మార్చి 17 వరకు టీబీ ముక్త్‌భారత్ విజయవంతం చేయాలన్నారు. క్షయపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. 2025 డిసెంబర్ నాటికి క్షయరహిత జిల్లాగా చేసేందుకు కృషి చేయాలని ఆమె కోరారు. దవాఖానలో సాధారణ కాన్పులు జరిగే విధంగా ప్రజలకు అవగహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో తారాసింగ్, డాక్టర్లు కల్పన, భావన, డీపీవో రేణయ్య, ఫార్మసిస్ట్ శ్రీనివాసులు, సిబ్బంది ఆరిఫ్ కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

చిరంజీవి నుంచి అవార్డు

కల్వకుర్తి, ఫిబ్రవరి 8 : పద్మవిభూషణ్ చిరంజీవి నుంచి కల్వకుర్తి మండలం తర్నికల్‌కు చెందిన నరేందర్ అవార్డు అందుకున్నారు. నరేందర్ చిరంజీవి స్థాపించిన బ్లడ్ బ్యాంక్‌కు రక్తం ఇవ్వడమే కాకుండా రక్తదాన శిబిరాలను నిర్వహించారు. ఎక్కువ రక్తదాన శిబిరాలు నిర్వహించినందుకుగానూ శనివారం హైదరాబాద్‌లోని బ్లడ్‌బ్యాంక్ కార్యాలయంలో నరేందర్‌కు బెస్ట్ బ్లడ్ బ్యాంక్ క్యాంప్ ఆర్గనైజర్ మెమోంటోను చిరంజీవి అందజేశారు.

నరేందర్‌కు మెమోంటోను అందజేస్తున్న చిరంజీవి

ఎస్ఎఫ్ఐ కమిటీ ఎన్నిక

అమ్రాబాద్, ఫిబ్రవరి 8 : మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీని జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దేవసింగ్, కార్యదర్శి పరమేశ్, ఉపాధ్యక్షుడిగా తేజసవ్య, సహకార కార్యదర్శి శివతో పాటు మొత్తం 15మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నట్లు సయ్యద్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన విద్యాశాఖమంత్రిని ఏర్పాటు చేయలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే అందించాలన్నారు. కార్యక్రమంలో రాజేశ్, తరుణ్, ఉదయ్, శృతి, భవాని, రాజేశ్వరి, రిషిక, పూజిత, భాను తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీవర్గీకరణతో మాలలకు అన్యాయం

పెంట్లవెల్లి, ఫిబ్రవరి 8 : ఎస్సీ వర్గీకరణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మాలలకు అన్యాయం చేస్తున్నదన్ని మాల చైతన్య సమితి తాలుకా అధ్యక్షుడు ఎర్రశ్రీను మండిపడ్డారు. శనివారం మండలకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అసెంబ్లీలో ఈ నెల4న కాంగ్రెస్ ప్రభుత్వం 341 ఆర్టికల్‌కు విరుద్ధంగా తీర్మానం చేయడం సమజసం కాదన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి పునః సమీక్షించుకొని మాలలకు న్యాయం చేయాలని ఆయన కోరారు. లేదంటే మాలల చైతన్య సమితి ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రాజు, సిద్ధయ్య, మోహన్, రవి, కేశవులు, లాలు, మహేశ్, మధు, సుధాకర్ తదితరులు ఉన్నారు.

సృజనాత్మక ఆలోచనలు పెంచుకోవాలి

కొండనాగుల డిగ్రీ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న రవి

బల్మూరు, ఫిబ్రవరి 8 : సృజనాత్మక ఆలోచనలు విద్యార్థులు పెంచుకోవాలని ప్రిన్సిపాల్ రవి అన్నారు. శనివారం మండలంలోని కొండనాగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూత్‌ఫర్ సోషల్ ఇంపాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు గ్రామాల్లో చదువుతో పాటు అన్నింటిపైన అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు వ్యాపారం, ఆదాయ వనరులు తదితర అంశాలపై సృజనాత్మక ఉండాలన్నారు. కార్యక్రమంలో రూపింగ్‌సింగ్, ఈశ్వర్, నర్సింహ, నర్సింహారావు, వెంకటయ్య, జాన్ బాబు, బాలరాజు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు గీత కార్మికుడు మృతి

నాగర్‌కర్నూల్ రూరల్, ఫిబ్రవరి 8 : మండలంలోని నాగనూల్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్(58) తమ కుల వృత్తిలో భాగంగా రోజు మాదిరిగానే కల్లు గీసేందుకు వారి వ్యవసాయ పొలానికి వెళ్లాడు. కల్లుకోసం ఈత చెట్టుపైకి ఎక్కి కల్లు తీస్తున్న క్రమంలో ఒక్కసారిగా చెట్టుపై నుంచి కిందికి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానికుల సహాయంతో శ్రీనివాస్‌గౌడ్‌ను హుటాహుటిన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం దవాఖానకు తరలించారు. అప్పటికే శ్రీనివాస్‌గౌడ్ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానకు తరలించారు. మృతుడు శ్రీనివాస్‌గౌడ్‌కు భార్య, ఓ కూతురు, కొడుకు ఉన్నారు. గ్రామంలో అందరితో కలివిడిగా ఉండే శ్రీనివాస్‌గౌడ్ తమ కులవృత్తిలోనే మరణించడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

మృతి చెందిన గీత కార్మికుడు శ్రీనివాస్‌గౌడ్

ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్న గ్రామస్తులు

ఇసుక ట్రాక్టర్‌ను అడ్డుకంటున్న గ్రామస్తులు

తాడూరు, ఫిబ్రవరి 8 : మండలంలోని ఎట్టిధార్‌పల్లి గ్రామానికి చెందిన శేఖర్ శనివారం ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా దుందుభి నదిలో నుంచి ఇసుకను ట్రాక్టర్‌లో తీసుకెళ్తుండడంతో గమనించిన గోవిందాయపల్లి గ్రామ పెద్దలు రహదారిపై అడ్డుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను ఎక్కడికి తరలిస్తున్నావంటూ ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పాడు. దీంతో పోలీసులు వచ్చే దాకా వాహనాన్ని కదలనిచ్చేది లేదంటూ నిరసన తెలిపారు.

కొంత సమయం తర్వాత పోలీసులు వచ్చి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PM సూర్యఘర్
★ 78000/- రూ॥ల సబ్సిడీ, 360 యూనిట్లు నెలకు ఫ్రీ, SBI లోన్ సౌకర్యం కలదు. మిగతా వివరాలకు సం॥ప్ర॥ NEW PLANER POWER SOLUSIONS, Newtown, Mahabubnagar. Cell:8686166354, 7842520780.
NT-MBNR

CHANGE OF NAME
★I, MOHAMMED GHIYASUDDIN, R/o. 13-138, Kaverammapeta, Jadcherla, Mahabubnagar-509 301, TS. Changed My Name as "MOHAMMED GAYASUDDIN, S/o. Mohammed Jahangeer".
NT-330465

డాక్యుమెంట్ పోయినది
ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయడం ఏమనగా! శ్రీమతి మనల్‌రఫత్ తండ్రి శ్రీ మహమ్మద్ ముజాహిద్ అలీ, నివాసం: ఇం.నెం. 14-5-121/ C/5, BK రెడ్డి కాలనీ, మహబూబ్‌నగర్ జిల్లా గారి యొక్క మహబూబ్‌నగర్ పట్టణంలో గల ప్లాటు అనగా భూమి సర్వే నెం.94లో ప్లాటు నెంబర్ 3 లో నిర్మించుకున్న గృహము ఇం.నెం. 14-5-121/ C/5, గల గృహము యొక్క లింక్ డీడ్ / డాక్యుమెంట్ నెం.10583/2012, తేది: 23-11-2012 గల ఒరిజినల్ లింక్ డీడ్ డాక్యుమెంట్ ఎక్కడో పడిపోయినది. కావున ఇట్టి ఒరిజినల్ డాక్యుమెంట్ ఎవరికైన లభించినచో క్రింది నెంబరుకు తెలియపరుచగలరు.
శ్రీమతి మనల్ రఫత్ సెల్ నెంబర్ :
9700962535

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748